

'విద్యారంగ పటిష్టతకు చర్యలు చేపట్టాలి'

దౌల్తాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ పటిష్టతకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం దౌల్తాబాద్, అహ్మద్‌నగర్, తిరుమలాపూర్, ముబారస్‌పూర్, మల్లేశంపల్లి, శేరిపల్లి, ఉప్పరపల్లి, కోనాపూర్, నర్సంపేట, లింగరాజుపల్లి, గోవిందాపూర్, దీపాయంపల్లి, గొడుగుపల్లి ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షేక్ వలి అహ్మద్, ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి, శివలింగం పాల్గొన్నారు.

ప్రాణాలు పోవాల్నా?

- అచ్చుమాయిపల్లిలో కూలిన కల్వర్టు
- ప్రమాదాల బారిన ప్రజలు
- నిర్మించాలని విన్నవిస్తే.. నిధులు లేవంటున్న అధికారులు

8

రోడ్డు ప్రమాదంలో ఎస్సై దుర్మరణం

- ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన కారు
- బల్కంపేటలో బందోబస్తుకు వెళ్లి తిరిగివస్తుండగా ప్రమాదం

6

మలబార్ గోల్డ్ ఆభరణాల తయారీ ప్లాంట్‌ను సందర్శించిన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో మలబార్ గోల్డ్ ఆభరణాల తయారీ ప్లాంట్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌తో పాటు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి గురువారం హాజరయ్యారు. ఇండస్ట్రియల్ పార్కులో నిర్మించిన ఈ ప్లాంట్‌ను ఆమె సందర్శించారు.





ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులతో కలిసి ప్రారంభోత్సవానికి హాజరైన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ హైమావతి

హుస్నాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల్లో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. హుస్నాబాద్ నుంచి కొత్తపల్లి నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులకు ఆయా శాఖల అధికారులు వేగంగా పర్మిషన్ ఇవ్వాలన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తిచేసి ఈనెల చివరి లోపు పనులు ప్రారంభించాలని చెప్పారు. అంతకపేటలో 220కేవి విద్యుత్ జంక్షన్‌కు 10 ఎకరాల స్థలం తహసీల్దార్ వద్ద సిద్ధంగా ఉందని, ట్రాన్స్‌కో అధికారులు అనుమతులు తీసుకోవాలని సూచించారు. జిల్లెలగడ్డ వద్ద నిర్మించే శాతవాహన ఇంజనీరింగ్ కళాశాలకు స్థల సేకరణ పూర్తిచేశామని ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే ఇంజనీరింగ్ అధికారులకు అందిస్తామని చెప్పారు. కొత్త చెరువు బండ్ అభివృద్ధికి ఇరిగేషన్ అధికారులు అనుమతులు ఇవ్వాలన్నారు. హుస్నాబాద్ నుంచి జనగామ వరకు నిర్మించే నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం ప్రపోజల్ దశలో ఉందన్నారు. హుస్నాబాద్ రింగ్ రోడ్డుకు ప్లానింగ్ చేసి మూల మలుపులు ఎక్కువగా లేకుండా మ్యాపింగ్ చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. హుస్నాబాద్ డిగ్రీ కళాశాలలో 60 సీట్లతో ఎంకామ్ పీజీ కోర్సు మంజూరైందని తెలిపారు.



తమ వారి ఆచూకీ కోసం అధికారులను ఆరా తీస్తున్న కుటుంబసభ్యులు

మావాళ్లు ఎక్కడ?

చివరిచూపునకూ నోచని వైనం.. పరిశ్రమ వద్ద పడిగాపులు

సెల్‌ఫోన్లలో ఫొటోలు చూపిస్తూ ఆరా

పటన్‌చెరు/రామచంద్రాపురం టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడులో శిథిలాల కింద నలిగిన బతుకుల ఆచూకీ దొరకడం లేదు. మృతులంతా మాంసపు ముద్దలుగా మారడంతో బంధువుల కడచూపునకూ నోచుకోని పరిస్థితి. ఓ పక్క డీఎన్‌ఏ పరీక్షల కోసం రక్తం ఇచ్చిన కుటుంబ సభ్యులు ఆందోళనగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు 31 మంది మృతదేహాలను గుర్తించగా, ఏడుగురి మృతదేహాలు మార్చురీలో ఉన్నాయి. గురువారం పేలుడు జరిగిన ప్రాంతంలోని శిథిలాలన్నీ తొలగించారు. మార్చురీలో కేవలం ఏడు మృతదేహాలే ఉండగా, తమ వారి ఆచూకీ చెప్పాలని పలువురు ఇంకా పరిశ్రమ వద్ద వేచి ఉన్నారు. ఆ శిథిలాల్లోనూ అవశేషాల కోసం వెతుకుతున్నారు. అందులో గుర్తింపుకార్డులు, సెల్‌ఫోన్లు, పర్సులు, ఇతర వస్తువులతో పాటు ఓ అరచేయి దొరికింది. ఇంకా ఆచూకీ దొరకని వారి బంధువులు మార్చురీ గదుల్లో కాలి మాంసపు ముద్దలుగా మారిన మృతదేహాలను చూసి, తమ వాళ్లు కాదంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. సెల్‌ఫోన్లలో తమ వారి ఫొటోలు చూపిస్తూ పరిశ్రమ పరిసరాల్లో తిరుగుతున్నారు. ప్రమాదం జరిగి నాలుగు రోజులు అవుతున్నా ఇంకా కొందరి ఆచూకీ చిక్కకపోవడంతో వారి ఆశలు ఆవిరే అన్న భావన వ్యక్తమవుతోంది. తమ వారి ఆచూకీ చెప్పాలని, ఒకవేళ చనిపోతే మృతదేహాలను అయినా అప్పగించాలని, కనీసం అస్థికలు ఇచ్చినా వెళ్లిపోతామని అంటుండం వారి ఆవేదనకు అద్దం పడుతోంది. మార్చురీలో ఉన్న మృతదేహాల సంఖ్య కంటే ఆచూకీ తెలియని వారే ఎక్కువగా ఉండటంతో అసలు తమవారు ఎక్కడ అన్న ప్రశ్న ఉదయిస్తోంది. మరో పక్క పేలుడు జరిగిన పరిశ్రమ వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. ఎవరినీ అటువైపు వెళ్లనివ్వడం లేదు. ఇక ప్రమాదంలో చనిపోయిన వారంటూ కొన్ని ఫొటోలు, పేర్లు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే, అధికారులు మాత్రం ధ్రువీకరించలేదు. ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ గురువారం పరిశ్రమ పరిసరాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించింది.



కుప్పలు కుప్పలుగా ఉన్న చోట భారీ అయిన శిథిలాలు

నిర్లక్ష్యమే కారణమా?

సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదం వెనుక అధికారుల నిర్లక్ష్యమూ ఓ కారణంగా చెబుతున్నారు. అన్ని శాఖల అధికారులు నిత్యం తనిఖీలు చేయాల్సి ఉండగా, మామూళ్లు తీసుకుని మిన్నకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలోనే హెచ్చరించామంటూ కర్మాగారాల శాఖ అధికారులు చెపుతున్నా, అందుకు తగ్గట్టుగా పరిశ్రమ యజమానిపై ఎటువంటి కేసులు పెట్టిన దాఖలాలు లేవు. బాయిలర్ శాఖ అధికారులు మాత్రం చుట్టపు చూపుగా వచ్చామా వెళ్లామా అన్నట్టుగా సందర్శించి వెళతారు. ఇక వీరి కార్యాలయం అబిడ్స్‌లో ఉంది. వీరి వద్దకు వెళ్లాలంటే ముందుగా ఫోన్‌చేసి చిరునామా తెలుసుకొని ఉంటారా లేదా అని అడిగి వెళ్లాల్సి ఉంటుంది. కాలుష్యనియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు మాత్రం ఫిర్యాదు వచ్చినప్పుడు నమూనాలు సేకరించి వెళతారు. ఆతర్వాత ఏం చేస్తారో ఎవరికీ తెలియదు. ఎయిర్‌ఫ్రెజర్‌తో పేలుడు సంభవించిన తరువాత అదే భవనంలో ఉన్న రియాక్టర్ సైతం పేలింది. దీనిపై పీసీబీ అధికారులు ఎలాంటి ప్రకటన చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. నిర్మాణ అనుమతులు మంజూరు చేసే ఐలా అధికారులు మాత్రం మౌనం పాటిస్తున్నారు. కంపెనీలో జరిగిన అన్ని రకాల నిర్మాణాల విషయంలో ఉల్లంఘనలు కళ్లకు కనిపిస్తున్నా పట్టించుకోవడం అనుమానాలకు దారి తీసింది. షెడ్, బాయిలర్, ట్రాన్స్‌ఫార్మర్, స్టీమ్ పైపులైన్‌లు పూర్తిగా ప్రహరీపై నిర్మించారు.

అగ్నిమాపక వాహనాలు వెళ్లేందుకు స్థలమేది?

సోమవారం ఉదయం 9.18 గంటలకు ప్రమాదం జరిగినప్పుడు అగ్నిమాపక వాహనం పూర్తిగా లోనికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ప్రధాన గేటులోంచి లోనికి వెళ్లినా మంటలను ఆర్పి, పక్కనే ఎగిసి పడుతున్న మంటలను ఆర్పడానికి వీలు కాలేదు. వాహనం గేటు బయటకు వచ్చి వెనక్కి వెళ్లి ఆర్పాల్సి వచ్చింది. అప్పటికే మృతదేహాలు బూడిదగా మారాయి. మరిన్ని అగ్నిమాపక వాహనాలు వచ్చినా స్థలం లేకపోవడంతో బయటనే ఉంచారు. అందుకే మంటలను తొందరగా అదుపులోకి తీసుకురాలేకపోయారని స్థానికులు చెప్పారు. పరిశ్రమకు అగ్నిమాపకశాఖ అధికారులు నిరభ్యంతర పత్రాన్ని జారీ చేయలేదు. అయినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం చర్చకు దారి తీసింది.

అలుపెరగని అంబులెన్స్ డ్రైవర్లు 6



మాట్లాడుతున్న ఎంపీ చామల

పేదల మోములో ఆనందం

- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

చేర్యాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో పేదల మోములో ఆనందం కనబడుతున్నదని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చేర్యాల మున్సిపల్, రూరల్ మండలం, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన 636 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం స్థానిక గార్డెన్స్‌లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై కలెక్టర్ హైమావతితో కలిసి మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు కేవలం కాగితాలకు పరిమితం కారాదని, రాజకీయాలకు అతీతంగా మంజూరు చేయడంతో పాటు డబ్బు చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఏమాత్రం ఆలస్యం చేయకుండా పనులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. హుస్నాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతమవుతున్నా ఇక్కడ ప్రారంభానికి నోచుకోకపోవడం విచారకరమని, త్వరగా ఇంటి నిర్మాణం పూర్తిచేసిన వారి ఇంటి గృహప్రవేశానికి వస్తానని, ఖర్చులు తానే భరిస్తానని ప్రకటించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. సమావేశం జరుగుతుండగా ఓ వ్యక్తి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని ఆగ్రహం వ్యక్తంచేస్తుండగా, పోలీసులు అతడిని బయటకు పంపించారు. అనంతరం ఇటీవల గాయాలపాలైన కాంగ్రెస్ కార్యకర్త కాటం శ్రీనివాస్, మాతృవియోగం పొందిన ఆకునూరు మాజీ ఎంపీటీసీ సుంకరి శ్రీధర్‌ను పరామర్శించారు.



దుబ్బాక బస్‌డిపోకు మరో పది బస్సులివ్వండి

- ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు ఎమ్మెల్యే వినతి

దుబ్బాక, జూలై 3 (ఆంధ్రజ్యోతి): టీఎస్ ఆర్టీసీ దుబ్బాక బస్‌డిపోకు అదనంగా పది కొత్త బస్సులను కేటాయించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి గురువారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. దుబ్బాక నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తే ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. దుబ్బాక బస్‌డిపో ఆదాయ సేకరణలో ముందుందని, గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రస్తుతం డిపోలో కాలం చెల్లిన బస్సులు మరమ్మతులతో నడుస్తున్నాయని, ఇవి సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందిగా మారుతున్నాయని పేర్కొన్నారు. కొత్త బస్సులతో పాటు కొత్త రూట్లపైనా ఆయన ఎండీ సజ్జనార్‌తో చర్చించారు. దుబ్బాక బస్‌డిపో ఆర్టీసీ సమస్యలను కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

యూరియా బస్తా రూ.320 పైమాటే?

గ్రామాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్న ప్రైవేట్ డీలర్లు

- ఈ సీజన్‌కు జిల్లాలో 49,500 మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా
- జూన్ చివరి నాటికి జిల్లాకు చేరింది 8,714 మెట్రిక్ టన్నులే
- ప్రభుత్వ సొసైటీల్లో ఆధార్‌కార్డుకు రెండు బస్తాలే పంపిణీ
- కృత్రిమ కొరత సృష్టిస్తూ సొమ్ముచేసుకుంటున్న వ్యాపారులు
- ఆందోళనలో రైతులు.. చోద్యం చూస్తున్న వ్యవసాయాధికారులు



జిల్లా రైతాంగానికి అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. ఇంతకాలం వర్షాలు లేక, భూగర్భజలాలు అడుగంటి ఆందోళన చెందారు. ఇప్పుడు సరిపడా యూరియా లేక ఆవేదన చెందుతున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమై 40 రోజులు కావస్తున్నా వ్యవసాయాధికారులు యూరియాను అందుబాటులో ఉంచకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అదనుగా భావించిన కొందరు ప్రైవేటు డీలర్లు రూ.320పైనే విక్రయిస్తున్నారు.

- తొగుట, జూలై 3 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 3,76,000 ఎకరాల్లో వరి, 22,200 ఎకరాల్లో మక్క, 1,11,000 వేల ఎకరాల్లో పత్తి, 7 వేల ఎకరాల్లో కందులు సాగుచేస్తారని అధికారులు అంచనా వేశారు. సరైన వర్షాలు కురవకపోవడంతో జూన్ చివరి నాటికి సుమారు 80 వేల ఎకరాల్లో వరి, 57,839 ఎకరాల్లో పత్తి, 10 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 432 ఎకరాల్లో కందులు సాగు చేసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ సీజన్‌కు జిల్లాలో 49.500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపినప్పటికీ జూన్ చివరి నాటికి జిల్లాకు చేరింది 8714 మెట్రిక్ టన్నులు మాత్రమేనని సమాచారం. వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు తొలి, మలిదశలో యూరియా అవసరం ఉంటుంది. దుబ్బాక నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలో 620 ఎకరాల్లో వరి, 850 ఎకరాల్లో పత్తి, 1450 ఎకరాల్లో మక్క సాగు చేశారు. దుబ్బాక మండలంలో 125 ఎకరాల్లో వరి, 12 ఎకరాల్లో పత్తి, 3 ఎకరాల్లో మొక్కజొన్న, మిరుదొడ్డి మండలంలో 580 ఎకరాల్లో వరి, 680 ఎకరాల్లో పత్తి, 33 ఎకరాల్లో మొక్కజొన్న, తొగుట మండలంలో 330 ఎకరాల్లో వరి, 950 ఎకరాల్లో పత్తి, 866 ఎకరాల్లో మొక్కజొన్న, రాయపోల్ మండలంలో 6200 ఎకరాల్లో వరి, 2850 ఎకరాల్లో పత్తి, 435 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేసినట్లు వ్యవసాయ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి.

మిగతా 8వ పేజీలో

పదోన్నతులు బాధ్యతను పెంచుతాయి

- సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, జూలై 3(ఆంధ్రజ్యోతి): పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని సీపీ అనురాధ అన్నారు. జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు టి.రాజేశం, ఎస్.ఉదయ్‌కుమార్, కె.సుధాకర్‌రెడ్డి, యేసుస్వామి, కె.రవిరాజు, యాదయ్య, కె.అంజిరెడ్డి హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా గురువారం కమిషనర్ కార్యాలయంలో సీపీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సీపీ వారిని అభినందించి మాట్లాడారు. పదోన్నతి పొందిన వారు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలన్నారు. సీనియారిటీ ప్రకారం అందరికీ ప్రమోషన్స్ వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన

సిద్దిపేట అర్బన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట నుంచి హుస్నాబాద్ వెళ్లే రూట్‌లో రంగధాంపల్లి సమీపం నుంచి మిట్టపల్లి సమీపము వరకు నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణంపై అధికారులు పూర్తిస్థాయిలో నోటీసులు ఇవ్వకుండానే, కొలతలు తీసుకోకుండానే నష్టపరిహారం తీసుకోమని చెప్పడం సమంజసం కాదని పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ సంతోష్ అన్నారు. గురువారం సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట బ్రిడ్జి బాధితులతో కలిసి నిరసన తెలిపి మాట్లాడారు. రహదారి నుంచి 50 ఫీట్ల వరకు మార్కింగ్ గతంలో ఇచ్చినప్పుడు అనేక నిరసన కార్యక్రమాలు చేపడితే తగ్గిస్తామని చెప్పిన ప్రభుత్వం ఎంతవరకు తగ్గించిందో ఇంతవరకు బాధితులకు తెలుపలేద న్నారు. అక్కడ భూమి విలువ మార్కెట్ ధర గజానికి రూ.2100 ఉంటే ప్రభుత్వం రూ.300 ఇస్తామనడం ఎంతవరకు న్యాయమని అన్నారు. గవర్నమెంట్ వాల్యూకు మూడు రెట్లు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో బాధితులు రాజు, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.



అలుపెరగని అంబులెన్స్ డ్రైవర్లు

- రాత్రింబవళ్లు శ్రమిస్తూ సహాయక చర్యల్లో కీలక పాత్ర
- దేశ నలుమూలలకు మృతదేహాల తరలింపు
- ఇంత దారుణం గతంలో చూడలేదంటూ ఆవేదన

పటాన్‌చెరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సిగాచి పరిశ్రమలో జరిగిన దుర్ఘటన బాధితులను ఆదుకోవడానికి చేపట్టిన సహాయక చర్యల్లో అంబులెన్స్ డ్రైవర్లు అలుపెరగని యోధులుగా నిలుస్తున్నారు. నాలుగు రోజులుగా రాత్రింబవళ్లు శ్రమిస్తూ, తమ విధి నిర్వహణలో రాజీ పడకుండా, ఈ విపత్కర పరిస్థితిలో మానవత్వాన్ని చాటుకుంటున్నారు.

30 అంబులెన్స్‌లు.. అవిశ్రాంత సేవలు

సిగాచి ప్రమాద బాధితులకు సేవలు అందించేందుకు ఉస్మానియా, గాంధీ, నల్గొండ, గజ్వేల్, సిద్దిపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, సంగారెడ్డి నుంచి మొత్తం 30 ప్రభుత్వ అంబులెన్స్‌లను రప్పించారు. ఈ అంబులెన్స్‌ల పైలట్‌లు (డ్రైవర్లు) దేశంలో ఏ ప్రాంతానికైనా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. ఇప్పటివరకు ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను వారణాసి, బీహార్, ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, కడప, విజయవాడ, చిత్తూరు వంటి సుదూర ప్రాంతాలకు తరలించారు. చికిత్స పొందుతున్న బాధితులు ఉన్న ఆసుపత్రుల వద్ద కూడా 24 గంటలూ అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు.



సిగాచి ప్రమాద సహాయక చర్యల్లో అంబులెన్స్ డ్రైవర్ల బృందం

మూట కట్టి తెచ్చాం



కర్తవ్య నిర్వహణలో రాజీ పడకుండా పనిచేస్తున్నాం. ప్రమాదాలలో చిక్కుకున్న క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రులకు చేర్చడమే లక్ష్యంగా విధి నిర్వహణ కొనసాగిస్తున్నాం. సిగాచి ఘటనలో కొందరు బాధితుల శరీర భాగాలను మూట కట్టుకుని తెచ్చాం. కొందరి కాళ్లు, చేతులు, ఇతర శరీర భాగాలను సైతం సేకరించి జాగ్రత్తగా మార్చురీకి చేర్చాం. క్షతగాత్రులకు సత్వరం వైద్య సేవలు అందించేందుకు ఒక్క క్షణం కూడా ఆలస్యం కాకుండా ఆసుపత్రులకు తరలించేందుకు కృషి చేశాం

- అరుణ్, అంబులెన్స్ పైలట్

హృదయవిదారకంగా ఉంది



గతంలో ఏనాడు ఈ తరహా దారుణ సంఘటన చూడలేదు. ప్రమాదం జరిగిన చోట పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. బాధితుల ఆర్తనాదాలు ఇప్పటికీ చెవుల్లో మార్మోగుతున్నాయి. ఆసుపత్రికి తరలించిన ప్రతీ ఒక్కరి ప్రాణాలు కాపాడాలన్నదే మా ఆశయం. నాలుగు రోజులుగా సహాయక చర్యల్లో పాలుపంచుకుంటూ, అలుపెరగకుండా పనిచేయడం ద్వారా విధి నిర్వహణలో సంతృప్తి పొందుతున్నాం. బాధితులను వారి గమ్యస్థానాలకు చేర్చడానికి సిద్ధంగా ఉన్నాం. దేశంలోని నలుమూలలకు పార్థివదేహాలను తరలించేందుకు అధికారులు చేసిన ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తాం

- నవీన్‌గౌడ్, అంబులెన్స్ పైలట్

ఎంతదూరం వెళ్లేందుకైనా సిద్ధంగా ఉన్నాం



బాధితుల కోసం ఎంతదూరమైనా అంబులెన్స్‌ను తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నాం. నాలుగు రోజులుగా నిరవధికంగా పనిచేస్తున్నాం. సహాయక చర్యల్లో శక్తి వంచన లేకుండా పాలుపంచుకోవాలని మా కుటుంబ సభ్యులు సైతం ప్రోత్సహిస్తున్నారు. ఈ విపత్కర పరిస్థితిలో ప్రతీ ఒక్కరం స్వచ్ఛందంగా పనిచేస్తున్నాం. డ్రైవర్లంతా కలిసికట్టుగా ఉంటూ ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తున్నాం.

- కృష్ణ, అంబులెన్స్ పైలట్



రోడ్డు ప్రమాదంలో ఎస్సై దుర్మరణం

- ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన కారు
- బల్కంపేటలో బందోబస్తుకు వెళ్లి తిరిగివస్తుండగా ప్రమాదం

కంది, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇండికేటర్స్ వేయకుండా రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని కారు ఢీకొన్న ఘటనలో హైదరాబాద్ నగరంలోని ఫిల్మ్‌నగర్ ఎస్సై రాజేశ్వర్ (54) దుర్మరణం పాలయ్యారు. ఇందుకు సంబంధించి సంగారెడ్డి రూరల్ ఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని చాణక్యపురికాలనీలో నివాసం ఉంటున్న ఎం.రాజేశ్వర్ వారం క్రితం హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ ఎస్సైగా విధుల్లో చేరారు. బుధవారం రాత్రి వరకు బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద బందోబస్తు డ్యూటీ ముగించుకుని అర్ధరాత్రి సంగారెడ్డికి కారులో తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో కంది శివారులోని చేర్యాల గేటు వద్ద హైవే పక్కన నిలిపిఉంచిన లారీని వెనక నుంచి రాజేశ్వర్ కారు ఢీకొట్టారు. ఈ ఘటనలో తల పగిలి తీవ్ర రక్తస్రావం జరిగింది. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. హైవే పెట్రోలింగ్ పోలీసులు వెంటనే ఆయనను సంగారెడ్డి ప్రభుత్వ ఆస్రత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్సై రాజేశ్వర్ 1990లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. నాలుగు నెలల క్రితమే సబ్ ఇన్స్‌పెక్టర్‌గా ప్రమోషన్ పొందారు. వారం రోజుల క్రితం ఫిల్మ్‌నగర్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అయితే, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎస్సై అంత్యక్రియలు సంగారెడ్డి మార్కెట్‌లో ఉన్న శ్మశానవాటికలో అధికార లాంఛనాలతో నిర్వహించారు.

మరో మహిళతో భర్త..

- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న భార్య


చేర్యాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మరో మహిళతో భర్త వివాహేతర సంబంధం కొనసాగిస్తుండగా, భార్య తమ బంధువులు, మహిళా సంఘాల నేతలతో కలిసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గురువారం సిద్దిపేట జిల్లా చేర్యాలలో ఆందోళన చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. చిన్నకోడూరు గ్రామానికి చెందిన ఏటీ బాబు గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా ఇరువురిమధ్య మనస్పర్థలు రావడంతో తగాదాపడిన బాబు కుటుంబానికి దూరంగా ఉంటూ, మరో మహిళతో కలిసి నివసిస్తున్నాడు. వారు చేర్యాలలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న విషయం తెలుసుకున్న భార్య గురువారం ఉదయం తమ బంధువులు, మహిళాసంఘాల నాయకులతో కలిసి అక్కడికి వచ్చి వారు ఇంట్లో ఉండగా, రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. భార్య వెంట వచ్చిన వారు అతడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, దాడికి దిగారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో వారు వచ్చి బాబును, అతడితో ఉన్న మహిళను అదుపులోకి తీసుకున్నారు. తనను శారీరకంగా, మానసికంగా హింసించాడని భర్తపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నీరేష్ తెలిపారు.


భూ తగాదాలతో అన్నను హత్య చేసిన తమ్ముడు

- ఆలస్యంగా వెలుగులోకి..

జోగిపేట రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : భూ తగాదాలతో అన్నను తమ్ముడు హత్య చేసిన ఘటన జోగిపేట మండలం తాలెల్మ-వట్‌పల్లి మండలం పల్వట్ల శివారులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పల్వట్ల గ్రామానికి చెందిన మంగలి సాయిలు కనిపించడం లేదని 15 రోజుల క్రితం భార్య వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. తన భర్తను మరిది మల్లేశం హత్యచేసి ఉంటాడని సాయిలు భార్య అనుమానాన్ని వ్యక్తం చేయడంతో పోలీసులు మల్లేశంను విచారించారు. అన్న సాయిలును తానే హత మార్చి పూడ్చిపెట్టినట్లు మల్లేశం విచారణలో అంగీకరించాడు. దీంతో పోలీసులు మృతదేహం కోసం గురువారం గాలింపు చర్యలు మొదలుపెట్టారు. పూర్తి వివరాలను తెలియాల్సి ఉంది.







కమలాపూర్‌లో వ్యక్తి దారుణహత్య

పెద్దశంకరంపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు పెద్దశంకరంపేట మండల పరిధిలోని కమలాపూర్‌లో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పేట మండల పరిధిలోని కమలాపూర్ గ్రామానికి చెందిన తోట సుధాకర్(43) ప్రతి రోజు మాదిరిగానే తన ఇంటి ఆవరణలో నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పదునైన ఆయుధాలతో తలమీద దాడి చేయడంతో సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సుధాకర్ ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీసులకు గురువారం ఉదయం సమాచారం అందించడంతో, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, అల్లాదుర్గం సీఐ రేణుక రెడ్డి, పేట, అల్లాదుర్గం ఎస్సైలు ప్రవీణ్‌రెడ్డి, శంకర్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. క్లూస్‌టీం, జాగిలాలతో పోలీసులు విచారణ చేపట్టారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి తోట మాణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతుల మృతి

హవేళీఘణపూర్/కౌడిపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లోని వేర్వేరు గ్రామాల్లో విద్యుదాఘాతంతో గురువారం ఇద్దరు రైతులు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్లితే.. పీర్యా తండాకు చెందిన పాత్‌లోత్ బన్సీలాల్ (38) కూకుట్లపల్లి శివారులోని తన పొలానికి పురుగు మందు కొట్టేందుకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. భూపతిపూర్ గ్రామానికి చెందిన మంద అంజయ్య (47) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. తన పొలం వద్ద ఉన్న టేకు చెట్ల కొమ్మలు కొట్టివేస్తుండగా పైనున్న 11 కేవీ వైర్లకు కొమ్మ తగలడంతో అకస్మాత్తుగా కరెంట్ పాసు అవ్వడంతో మృతిచెందాడు.

బూజు కర్రకు కరెంట్ సరఫరా అయి మరొకరు..

రామచంద్రాపురం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వెలిమెల మాజీ సర్పంచ్ వై.నరేందర్‌రెడ్డి సోదరుడు ప్రవీణ్‌రెడ్డి గురువారం దుర్మరణం చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ప్రవీణ్‌రెడ్డి రోజూ మాదిరిగానే ఇంట్లో చిన్నచిన్న పనులకు పూనుకున్నాడు. ఈ క్రమంలో బయట కర్రతో బూజు దులుపుతున్న అతడి కర్రకు విద్యుత్ షాక్ తగిలి రోడ్డుపై పడ్డ ప్రవీణ్ తలకు తీవ్ర గాయమైంది. దీంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

ఖేడ్ సబ్‌రిజిస్ట్రార్‌కు గాయాలు

అల్లాదుర్గం, జూలై 3, (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మెహిదీపట్నానికి చెందిన మహ్మద్ నిజామోద్దీన్ నారాయణఖేడ్‌లోని సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురవారం సాయంత్రం విధులు నిర్వహించిన అనంతరం తన నివాసానికి కారులో వెళ్తున్న క్రమంలో అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామ శివారులోని జాతీయరహదారి పై ఉన్న కల్వర్టును బలంగా ఢీ కొట్టడంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. అయితే కారు నడుపుతున్న నిజిమోద్దీన్ స్వల్ప గాయాలతో బయటపడగా అతడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

CHANGE OF NAME

★ I, ANGOTH SURYA S/O ANGOTH MADAN H.No.4-43, CHEEPURUDUBBA THANDA, PATHUR (V) MDL & DIST MEDAK. I INTENDED MY NAME & SUR NAME MY FATHERS SUR NAME i.e., **DHARAVATH SURYA S/O DHARAVATH MADAN.** AJH-198600

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

న్యూస్ బాక్స్

నాచగిరి లక్ష్మీ నృసింహా స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకం

వర్గల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నాచగిరి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి నియామకాన్ని రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు తెలిపారు. ధర్మకర్తల మండలి ఒక సంవత్సరం కాలపరిమితికి నియమకం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 5న ఉదయం 10.30 గంటలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా వారి ఆధ్వర్యంలో దేవస్థాన ప్రాంగణంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులుగా పల్లెర్ల రవీందర్, జగ్గయగారి శేఖర్, దేశపతి ఉషాశ్రీ, గాలి కిష్టయ్య, కర్రె పద్మ, కొత్తపల్లి శ్రీనివాస్, జగ్గన్నగారి సురేందర్‌రెడ్డి, జేఎస్ తిరుమల రావు, రుద్ర శ్రీహరి, చంద నాగరాజు, దేవాదాయ శాఖ తరుపున ఆలయ ప్రధాన అర్చకులు జగన్నాద చార్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు.

మల్లిఖార్జున దేవాలయ కమిటీ..

దుబ్బాక, జూలై 3 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక రేకులకుంట మల్లిఖార్జున దేవాలయం నూతన పునర్నిర్మాణ కమిటీని ప్రభుత్వం నియమించింది. పది మంది సభ్యులతో కూడిన ఈ కమిటీలో ముదిగొండ ధర్మపురి (రాజక్కపేట), చిట్యాల ధనుంజయ (బల్వంతాపూర్), చేర్వాపూర్ బాల్‌రాజ్ (చిన్ననిజాంపేట), బాస మధు (ధర్మాజీపేట), పయ్యల పోశయ్య (దుబ్బాక), పరికి బాలాగౌడ్ (పెద్దగుండవెల్లి), కిష్టంగారి శ్రీనివాస్‌రెడ్డి (గంభీర్‌పూర్), పెంబర్తి బాలకిషన్ (రామక్కపేట), గుండవెల్లి వరలక్ష్మి (చెల్లాపూర్), బిల్లబాల్‌రాజ్ (దుబ్బాక) ఉన్నారని దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆర్. శైలజ ప్రకటించారు. గురువారం ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి వీరికి నియామకపత్రాలను అందజేశారు.

13 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి గత కొన్ని రోజుల క్రితం నుండి సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలో రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 13 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకున్నారు. వారిని గురువారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు న్యాయమూర్తి ముందు హాజరుపరచగా విచారణ చేసి రూ.25,500 జరిమానా విధించారు.

ఇద్దరికి అరెస్టు వారెంట్

నంగునూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులు కోర్టుకు హాజరు కాకపోవడంతో అరెస్టు వారెంట్ జారీ అయినట్లు రాజగోపాలపేట ఎస్ఐ ఆసిఫ్ తెలిపారు. నంగునూరు మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన బోడ తిరుపతిరెడ్డి, మద్దూరు మండలం బేక్కల్ గ్రామానికి చెందిన ఆరే ఉప్పలయ్యలు వేర్వేరు కేసుల్లో నిందితులుగా ఉండి కోర్టుకు హాజరు కానందున కోర్టు వారెంట్ జారీ చేసిందన్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరచగా వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపాడు.

వెటర్నరీ డాక్టర్ లేక ఇబ్బందులు

మర్కూక్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెటర్నరీ డాక్టర్ అందుబాటులో లేకపోవడం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సకాలం వైద్యం అందక పశువులు మృతిచెందుతున్నాయని మండల మాజీ ఎంపీపీ పాండుగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజుల క్రితం మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో గడ్డి మేస్తూ 15 మేకలు అస్వస్థతకు గురయ్యాయని, వైద్యం చేసేందుకు వెటర్నరీ డాక్టర్ లేక అవి మృతి చెందాయన్నారు. తాజాగా గురువారం గ్రామానికి చెందిన నిరుపేద కూలీ పెద్ద కురుమ సాయిలుది సుమారు రూ.లక్ష విలువ చేసే పాడి గేదె మృతి చెందిందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి మండలానికి వెటర్నరీ డాక్టర్‌ను నియమించాలని ప్రజలు కోరారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

బెజ్జంకి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో గురువారం మధ్యాహ్న భోజనాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ మల్లేశం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని వంటగదిని, వంట సరుకులను పరిశీలించి మాట్లాడారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని అన్నారు. వంటగది చుట్టూ పక్కల ఉన్న గడ్డి పొదలను తొలగించాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిందితులకు రిమాండ్

కొమురవెల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏప్రిల్ నెలలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో పలువురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు హుస్నాబాద్ ఏసీపీ సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే మరికొంత మంది నిందితులను రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.





ప్రాణాలు పోవాల్నా?

- అచ్చుమాయిపల్లిలో కూలిన కల్వర్టు
- ప్రమాదాల బారిన ప్రజలు
- నిర్మించాలని విన్నవిస్తే.. నిధులు లేవంటున్న అధికారులు

దుబ్బాక, జూలై 3 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మండలం అచ్చుమాయిపల్లి గ్రామంలో మురికి కాలువపై నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరి కూలిపోయింది. రహదారికి అడ్డంగా ఉన్న ఈ కూలిన కల్వర్టు కారణంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వద్ద నిధులు లేవని, గ్రామస్థులు సొంత డబ్బులతో నిర్మించుకుంటే, బిల్లులు మంజూరైన తర్వాత తిరిగి చెల్లిస్తామని అధికారులు చెబుతున్నారని వాపోతున్నారు. ఇందులో పడి ప్రాణం పోతే గానీ స్పందించరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి వెంటనే కల్వర్టును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు కంది విత్తనాల పంపిణీ

జగదేవ్‌పూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పప్పు దినుసుల సాగు సులభంగా చేయవచ్చని మండల వ్యవసాయ అధికారి వసంతరావు సూచించారు. కంది పంట సాగు విస్తీర్ణం పెంపుదల కోసం ప్రభుత్వం జాతీయ ఆహార భద్రతా మిషన్ పప్పు దినుసులు 2025 పథకంలో భాగంగా మండలానికి అదనంగా కేటాయించిన 4 కిలోల కంది పంట సంచులను 20 మంది రైతులకు అందజేశారు. డీసీసీబీ జగదేవ్‌పూర్ బ్యాంక్ మేనేజర్ నాగభూషణం, వ్యవసాయ విస్తీర్ణ అధికారి ఖలీల్ పాల్గొన్నారు.

అవగాహనతోనే అంటువ్యాధులు దూరం

నంగునూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే అంటువ్యాధులను అరికట్టవచ్చని రాజగోపాలపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సరిత అన్నారు. గురువారం నంగునూరు మండలం పాలమాకుల షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. హాస్టల్ విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులకు రక్తహీనతకు సంబంధించి పరీక్షలు నిర్వహించి లోపం ఉన్నవారికి మందులను పంపిణీ చేశారు.

కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం

- పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

తొగుట/దుబ్బాక/మిరుదొడ్డి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు సొంతింటి కల సాకారమవుతుందని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం తొగుట మండలంలోని మెట్టు, తొగుట బండారుపల్లి, పెద్ద మాసాన పల్లి, చందాపూర్, వెంకట్రావు పేట, జప్తిలింగారెడ్డిపల్లి, అలాగే అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు విడతల వారీగా వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ చెరుకు విజయ్‌రెడ్డి, పార్టీ తొగుట మండల అధ్యక్షుడు అక్కం స్వామి, నాయకులు పాల్గొన్నారు.

- దౌల్తాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాచినపల్లి, చెట్ల నర్సంపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పడాల రాములు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మద్దెల స్వామి, నాయకులు దుద్దెడ స్వామి, మల్లేశం, నాగరాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



తొగుట మండలం జప్తి లింగారెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేస్తున్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి

పకడ్బందీగా విధులు నిర్వహించాలి

- సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి

సిద్దిపేట అర్బన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సిద్దిపేట ఏసీపీ ఎం. రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించి సీఐ విద్యాసాగర్‌తో కలిసి సిబ్బందితో మాట్లాడారు. వర్టికల్ వారీగా ఎవరెవరు ఏఏ విధులు నిర్వహిస్తున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, మల్లేశం మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



త్రీ టౌన్ పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీపి రవీందర్ రెడ్డి

- కొండపాక, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కొండపాక శివారులోని పేలుడు పదార్థాలు గల గోదామును గజ్వేల్ ఏసీపీ నర్సింహులు గురువారం తనిఖీ చేశారు. వారు పంపిణీ చేసే లావాదేవీల రిజిస్టర్లను చూశారు.

బడులను తనిఖీ చేసిన డీఈవో

హుస్నాబాద్ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలంలోని పోతారం(ఎస్) స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని మీర్జాపూర్, బల్లునాయక్‌తండా, పూల్‌నాయక్‌తండా, కేబీ కాలనీ, నాగారం, ఉమ్మాపూర్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను గురువారం జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు, ఎఫ్ఆర్ఎస్ నమోదు రిజిస్టర్లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. బేస్ లెవల్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఉపాధ్యాయుల ఇయర్ ప్లానింగ్ టీచర్ డైరీ లెసన్ అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. డీఈవో వెంట సీఆర్పీ స్వామి ఉన్నారు.



బల్లునాయక్‌తండా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

శంకుస్థాపనలు సరే.. పనులెప్పుడు ? : బీఆర్ఎస్

హుస్నాబాద్ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మున్సిపాలిటీలో పలు సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేసి నెలలు గడిచినా ఇంకా పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. గురువారం బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి పట్టణంలోని 2, 14 వార్డుల్లోని రోడ్లను పరిశీలించారు. గతంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణం కోసం సీసీ రోడ్లను తవ్వి పైపులు వేసిన అనంతరం గుంతలు పూడ్చకుండా వదిలిపెట్టారని తెలిపారు. ఈ పనులను చేయడానికి శంకుస్థాపనలు చేసి పనులు మాత్రం ప్రారంభించడం లేదని, దీంతో ఆయా వార్డుల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల వికాస్, గడ్డం సదానందం, బత్తుల జీవన్, సతీష్ తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు దాతల చేయూత

చిన్నకోడూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో సిద్దిపేటకు చెందిన లయన్ ఉజ్వల మోదాని పుట్టినరోజు సందర్భంగా 132 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి చిన్నకోడూరు కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మయ్య హాజరై అందజేశారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ ప్రత్యేక తరగతి గదిని ఆయన ప్రారంభించారు.

- మద్దూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): దూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తన తండ్రి కీ.శే. రామిని చంద్రయ్య జ్ఞాపకార్థం కుమారుడు రామిని వీరేషం 60మంది విద్యార్థులకు షూ, సాక్స్ అందించారు.
- కుకునూరుపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): చిన్నకిష్టాపూర్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు ఆధార్ ఫర్ యు స్వచ్ఛంద సంస్థ స్కూల్ బ్యాగులను అందజేసింది.
- కొమురవెల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయినపూర్ ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు (2002-2003 బ్యాచ్) దాదాపు రూ.20వేల విలువైన క్రీడా సామగ్రిని అందించారు.

డ్రగ్స్, సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన

నంగునూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): చదువుకున్న దశలో విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాజగోపాలపేట ఎస్ఐ ఆసిఫ్ అన్నారు. గురువారం నంగునూరు మండలం మగ్దూంపూర్ హైస్కూల్‌లో విద్యార్థులకు వివిధ అంశాలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి సారించాలని తెలిపారు.

- సిద్దిపేట అర్బన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ అన్నారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులతో మాట్లాడి పలు సూచనలు, సలహాలు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దు అని అవగాహన కల్పించారు.
- దౌల్తాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో మహిళల చట్టాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.
- కొమురవెల్లి, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట గ్రామాన్ని గురువారం హుస్నాబాద్ ఏసీపీ సదానందం, చేర్యాల సీఐ ఎల్ శ్రీను సందర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలన్నారు. వారి వెంట ఎస్సై రాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

యూరియా బస్తా రూ.320 పైమాటే?

(5వ పేజీ తరువాయి..)

అయితే దుబ్బాక నియోజకవర్గానికి మాత్రం జూన్ చివరి నాటికి 1012 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే వచ్చినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రైతులు సాగు చేసిన పంటలకు సరిపడా యూరియా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ సొసైటీల్లో ఒక్కో యూరియా బస్తాకు ధర రూ. 266 ఉండగా హమాలీ, ట్రాన్స్‌పోర్టుతో కలిపి రూ.280 చొప్పున విక్రయిస్తున్నారు. సొసైటీల్లో ఒక్కో ఆధార్‌కార్డుకు రైతుకు రెండు యూ రియా బస్తాలే పంపిణీ చేస్తుండడంతో సమస్య ఉత్పన్నమవుతుంది. ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ డీలర్లు జిల్లా లో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. తొగుట మండలంలోని పలు గ్రామాల్లో ప్రైవేట్ డీలర్లు ఒక్కో బస్తాకు రూ.320 చొప్పున విక్రయిస్తున్నారు. యూరియా బస్తాలతో పాటు నానో యూరియా లీటర్ డబ్బా, కాంప్లెక్స్ ఎరువులు తీసుకోవాలని మెలిక పెడుతూ అందుకు అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రైవేట్ డీలర్లు తమదుకాణంలో విత్తనాలు కొనుగోలు చేసి పంటసాగు చేసిన వారికే ఎక్కువగా యూరియా విక్రయిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ సొసైటీల్లో యూరియా అందుబాటులో లేకపోవడం, వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేట్ డీలర్లు గ్రామాల్లో రైతులను అందినకాడికి దోచుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పంటల సాగుకు ఇబ్బందిగా మారింది



ప్రభుత్వం వర్షాకాలం సీజన్‌కు సంబంధించి సరిపడా యూరియా అందుబాటులో ఉంచకపోవడంలో సాగు ఇబ్బందిగా మారింది. మొక్కజొన్న పంటకు వేయడానికి యూరియా కోసం తిరుగుతున్నా దొరకడం లేదు. ప్రైవేట్ డీలర్లు ఎక్కువ ధరకు అమ్ముతుండ్రు. ఎక్కువ పెట్టి కొందామంటే యూరియాతో పాటు నానోయూరియా, దుక్కి మందులు కొంటేనే ఇస్తామని మెలిక పెడుతున్నరు.

- మల్లుగారి శ్రీకాంత్‌రెడ్డి, రైతు (గుడికందుల)

యూరియా తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నాం

ఎకరా పంట సాగు మొత్తంలో ఒక బస్తా యూరియానే వాడాలి. అలా కాకుండా రైతులు రెండు నుంచి మూడు వరకు యూరియా బస్తాలు వాడడం వల్ల భూమి నిస్సారం అవుతుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు యూరియా తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నాం.

- దుబ్బాక ఏడీఏ మల్లయ్య

దొంగల అరెస్టు

కొమురవెల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి, చేర్యాల పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హుస్నాబాద్ ఏసీపీ సదానందం కేసు వివరాలను వెల్లడించారు. కొమురవెల్లిలో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఓ వెంచర్ సమీపంలో నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా కొమురవెల్లి పరిధిలో పలు దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాకు చెందిన నిందితులు బిజిలి సురేష్, అంగడి జంపయ్య, దాసరి అశోక్, మదగాని సురేష్ హైదరాబాద్‌లోని నెరెడ్‌మెట్ ప్రాంతంలో అపార్ట్‌మెంట్‌లలో వాచ్‌మెన్, ఇతర పనులు చేస్తూ నివాసముంటున్నారు. కొమురవెల్లి లాంటి పుణ్యక్షేత్రాల్లో పగలు, అర్ధరాత్రి ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతుంటారు. కొమురవెల్లి చేర్యాల, కుకునూరుపల్లి, రాయపోల్, దుబ్బాక పరిధిల్లో మొత్తం 18 దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. జంపయ్య, సురేష్, అశోక్‌పై పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు ఉన్నట్లు తెలిపారు. వారి నుంచి 9 తులాల బంగారు ఆభరణాలు, 22 తులాల వెండి ఆభరణాలు, ఇనుప రాడ్, మూడు బైక్‌లు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దొంగలను పట్టుకున్న చేర్యాల సీఐ ఎల్ శ్రీనివాస్, కొమురవెల్లి ఎస్సై రాజుగౌడ్‌ను ఏసీపీ అభినందించారు.

విద్యుత్ అధికారుల ముఖాముఖి

సిద్దిపేట అర్బన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇక నుంచి ప్రతీ బుధవారం ప్రజలతో విద్యుత్ అధికారుల ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్ఈ చంద్రమోహన్ తెలిపారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల, మధిర, గాంధీనగర్‌లో ప్రజలతో ముఖాముఖి నిర్వహించిన సందర్భంగా పలు సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు విద్యుత్ అధికారుల దృష్టికి సమస్యలను తీసుకువెళ్లగా సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామని ఎస్ఈ తెలిపారు. ఇక నుంచి ప్రతి వారం గ్రామాల వారీగా కార్యక్రమాలను నిర్వహిస్తామని, సమస్యలను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీఈ రామచంద్రయ్య, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ శ్రీధర్ రెడ్డి, లైన్మెన్ పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

'నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలి'

దౌల్తాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): టీవీఏసి జేఏసీ రాష్ట్ర కమిటీ తలపెట్టిన నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని టీవీఏసి జేఏసీ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ రామగౌని రవికుమార్ గౌడ్ అన్నారు. గురువారం దౌల్తాబాద్‌లో దౌల్తాబాద్, రాయపోల్ సెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ కోసం ఈ నెల 14 నుంచి నిరవధిక సమ్మెకు టీవీఏసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చినట్లు తెలిపారు. అలాగే ఈ నెల 9న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశవ్యాప్త సమ్మెను, నిరవధిక సమ్మెను కార్మికులందరూ విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీజీయూఈఈయూ సిఐటియూ గజ్వేల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి భూపతి రాజు, నాయకులు అంజద్, రాజశేఖర్, లక్ష్మణ్, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల ముందస్తు అరెస్టు

చేర్యాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చేర్యాల పర్యటన నేపథ్యంలో పోలీసులు పలువురు సీపీఎం నాయకులను అరెస్టు చేశారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు హామీని విస్మరించిన ఎంపీ చామలను అడ్డుకుంటామని ప్రకటించిన నేపథ్యంలో పోలీసులు సీపీఎం నాయకులు కొంగరి వెంకట్‌మావో, బండకింది అరుణ్, రాళ్లబండి నాగ రాజు, బోయిని మల్లేశం తదితరులను ముందస్తు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై వారు మాట్లాడుతూ అక్రమ అరెస్టు చేయడం తగదన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

ములుగు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు 4 నెలలుగా బకాయిపడ్డ వేతనాలు చెల్లించాలన్నారు. వేతనాన్ని రూ. 26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

గుంతల మరమ్మతలకు చర్యలు

- ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

జగదేవ్‌పూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ నుంచి గొల్లపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై బ్రిడ్జి వద్ద ప్రమాదకరంగా ఏర్పడిన గుంతల మరమ్మతుకు కృషి చేస్తానని ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం గుంతలు పడిన రహదారి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం రోడ్డుపై వాహనాలు చాలా సంఖ్యలో రాకపోకలు కొనసాగుతాయని, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే గుంతలను పూడ్చివేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహనదారులు గుంతలను చూసి జాగ్రత్తగా ప్రయాణం చేయాలని సూచించారు.

బీజేపీ కార్యకర్తకు అండగా ఉంటాం

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

వర్గల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యకర్తలకు ఎటువంటి కష్టం వచ్చిన అండగా ఉంటామని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. గురువారం వర్గల్ మండలం మైలారం గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త ఎర్రవాడ ప్రవీణ్ కుమారుడు నిమోనియాతో ఆసుపత్రిలో చికిత్స పొందగా, ఎంపీ ప్రత్యేక చొరవ తీసుకుని సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.3.50 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బొల్లిపల్లి తిరుపతిరెడ్డి, నాయకులు బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పంపరి రమేశ్, నర్రరవి తదితరులు ఉన్నారు.

ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళను కాపాడిన పోలీసులు

సిద్దిపేట క్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళను సిద్దిపేట టూ టౌన్ పోలీసులు కాపాడారు. పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం, కరీంనగర్ రోడ్‌లోని వడ్డెర కాలనీకి చెందిన శివరాత్రి కనకవ్వ కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకుంటున్నానని హైదరాబాద్‌లో ఉన్న తన కూతురికి ఫోన్ చేసి చెప్పింది. దీంతో ఆమె కూతురు సిద్దిపేటలో ఉన్న వారి బంధువులకు ఫోన్ చేసి చెప్పగా, వారు సిద్దిపేట టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, ఐటీ కోర్ సిబ్బంది సహకారంతో కనకవ్వ ఆమె ఇంటిలో ఉన్నట్లు గుర్తించి అక్కడికి చేరుకుని ఉరివేసుకునే సమయంలో అడ్డుకుని రక్షించారు.

ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లకుండా చూడాలి

- ఆర్డీవో సదానందం

సిద్దిపేట రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లకుండా ప్రతిదీ క్షుణ్ణంగా చూసుకోవాలని ఆర్డీవో సదానందం బీఎల్‌వోలకు సూచించారు. గురువారం సిద్దిపేట రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలకు బూత్ స్థాయి జాతీయ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల దృష్టిలో పెట్టుకొని ఓటర్ల జాబితాను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాజేశం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయ కుమారి, ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఎంపీ తీరు సరికాదు : బీఆర్ఎస్

చేర్యాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ హామీ విషయాన్ని తుంగలో తొక్కిన భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చేర్యాల ప్రజలను వంచించడం తగదని బీఆర్ఎస్ యూత్ నాలుగు మండలాల అధ్యక్షుడు శివగారి అంజయ్య అన్నారు. చేర్యాల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీగా గెలిచి ఏడాది గడిచినా రెవెన్యూ డివిజన్ ఊసెత్తకపోవడం తగదన్నారు. చేర్యాల మున్సిపల్ పరిధిలో కేవలం 30 మందికి మాత్రమే ఇండ్లు ఇవ్వడం శోచనీయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలోపు రెవెన్యూ డివిజన్‌ను ప్రకటింపజేసి చిత్తశుద్ధి చాటుకోవాలని, లేనియెడల మళ్లీ చేర్యాలకు వస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ఒగ్గు శ్రీశైలం, చింతల పరశురాములు, యాట భిక్షపతి, కామల్ల అనిల్, రాచకొండ శ్రీనివాస్, పాక బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు